# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :93 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 11-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు..

హైదరాబాద్, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయడం జరుగుతుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ బడిబాటను నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా టేక్మాల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం బడిబాటను నిర్వహించారు. టేక్మాల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన, అనుభవజులైన ఉపాధ్యాయులు ఉంటారని.. ఉచితంగా పాఠ్యపుస్తకాలతోపాటు రెండు జతల యూనిఫామ్స్, నోట్ బుక్స్ ఇవ్వడం జరుగుతుందని ఉపాధ్యాయులు

## దేశంలో 7 వేలకు చేరువలో కరోనా యాక్టివ్ కేసులు..



న్యూఢిల్లీ, దేశంలో కొవిడ్-19 వ్యాప్తి కొనసాగుతోంది. గత 24 గంటల్లో 300కిపైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ 324 మందికి కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 7 వేలకు చేరువైంది. అత్యధికంగా నిన్న ఒక్కరోజే కర్ణాటకలో 136 మందికి పాజిటివ్‌గా తేలింది. ఆ తర్వాత గుజరాత్‌లో 129 కేసులు వెలుగు చూశాయి. కేరళలో 96 మందికి పాజిటిగా తేలింది.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. కేరళలో అత్యధికంగా 2053 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత గుజరాత్‌లో 1,109 కేసులు, పశ్చిమ బెంగాల్‌లో 747 కేసులు, ఢిల్లీలో 691, కర్ణాటకలో 559 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. తాజా కేసులతో కలిపి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6,815కి పెరిగింది. గత 24 గంటల్లో మూడు మరణాలు సంభవించాయి. ఢిల్లీ, జార?ండ్, కేరళలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ముగ్గురు మరణించారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో కొవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 68కి పెరిగింది.ఇక ఈ ఏడాది ఇప్పటి వరకూ కరోనా వైరస్ నుంచి 7644 మంది కోలుకున్నారు. మరోవైపు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది సంసిద్ధతను తనిఖీ చేసేందుకు కేంద్రం మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. అన్ని దవాఖానాలలో ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్స్, వెంటిలేటర్లు, ఇతరఅత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది.కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్, దాని సబ్ వేరియంట్స్ ఎన్‌బీ1.8.1 కారణంగా తెలుస్తున్నది. తాజాగా ఎక్స్ఎఫ్‌జీ వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి. ఇండియన్ సార్స్ కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియండేటా ప్రకారం.. దేశంలో ఈ వేరింట్ కేసులు 163 రికార్డయ్యాయి. మహారాష్ట్రలో అత్యధికంగా 89 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత తమిళనాడు (16), కేరళ (15), గుజరాత్ (11), ఆంధ్రప్రదేశ్ (6), మధ్యప్రదేశ్ (6), పశ్చిమ బెంగాల్ (6) కేసులు వెలుగు చూశాయి.

## అవినీతి రహిత పాలనకు నిదర్శన ప్రధాని మోడీ ప్రభుత్వం..!



విజయవాడ : విజయవాడ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దేశంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాల్లో భారతదేశం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని స్పష్టం చేశారు.విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన "మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి " కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోడీ పాలన ఎంత కీలకమైందో వివరించారు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉండిందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా "వన్ నేషన్ వన్ ట్యాక్స్" లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు.అలాగే మోడీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ.. వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నుంచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82% వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు " కిసాన్ సమ్మాన్ నిధి " ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్ లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రైక్, పహల్గావ్ దాడి, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు.మరోవైపు దేశంలో అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా.. 1.46 లక్షల కి.మీ. జాతీయ రహదారులు, 7.7 లక్షల కిమీ గ్రామీణ రహదారులు నిర్మించామని చెప్పారు. రైల్వే బడ్జెట్ 29,056 కోట్ల నుంచి 2.42 లక్షల కోట్లకు పెరిగిందని, 136 వందే భారత్ రైళ్లు ప్రారంభించామని వివరించారు. ఇక ఉడాన్ స్కీం ద్వారా సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చామని, 2014లో 71 విమానాశ్రయాలు ఉండగా.. ఇప్పుడు 159కి పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 26 AIIMS ఆసుపత్రులు ఇప్పటికే పనిచేస్తుండగా, మరో 15 నిర్మాణంలో ఉన్నాయని వివరించారు.బేటీ బచావో - బేటీ పఢావో, దీన్ దయాళ్ ఉపాధ్యాయ విద్యుత్ యోజన, ఆర్టికల్ 370 రద్దు, 140 శాటిలైట్‌ల ప్రయోగం, చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరటం వంటి చర్యలు మోడీ ప్రభుత్వం సామాజికంగా, శాస్త్రీయంగా దేశాన్ని ముందుకు నడిపించిందని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడుతూ.. 2014 లో లాభాల్లో ఉన్న రాష్ట్రం, మోడీ విధానాలను పాటించకపోవడంతో ఇప్పటికి 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలి..



అమరావతి, ఏపీలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులపై మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రంగా స్పందించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆడబిడ్డలపై ఇన్ని అరాచకాలు జరుగుతుంటే హోంమంత్రి వంగలపూడి అనితకు చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. మహిళా హోం మంత్రి ఉన్న రాష్ట్రంలో ఆడబిడ్డలపై దారుణాలు జరగడం సిగ్గుచేటు అని అన్నారు. మహిళలను కాపాడలేని పరిస్థితిలో ఉన్న అనిత.. హోంమంత్రి పదవి ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. మహిళలపై జరుగుతున్న దాడులను పట్టించుకోకుండా.. జగన్, భారతిలను విమర్శించేందుకే ఆ పదవిని తీసుకున్నారా అంటూ నిలదీశారు. నా చేతిలో గన్ ఉందా, నాకు పవర్ ఉందా అంటూ చేతగాని మాటలు మాట్లాడుతూ ఉంటే రాజీనామా చేయాలని అనితను డిమాండ్ చేశారు.నగరి నియోజకవర్గంలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినా.. అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థిని కనిపించకపోయినా పట్టించుకోలేదని రోజా విమర్శించారు. పరిటాల సునీత నియోజకవర్గంలో 14 మంది టీడీపీ నేతలు అత్యాచారానికి పాల్పడ్డారని.. ఈ అమానవీయ ఘటనకు కూటమి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో ఇన్ని అఘాయిత్యాలు జరుగుతున్న ప్రభుత్వం చొరవ చూపడం లేదని.. బాధితులకు న్యాయం జరగడం లేదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ స్పందించకపోవడాన్ని రోజా తప్పుబట్టారు. మహిళలపై హింస పెరిగినా పవన్ కల్యాణ్ స్పందిచడం లేదని.. చంద్రబాబు, లోకేశ్, పవన్ ముగ్గురూ మహిళలపై స్పందించకుండానే నిద్రపోతున్నారని విమర్శించారు.సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం దారుణమని రోజా అన్నారు. జగన్, భారతి క్షమాపణలు చెప్పాలని కూటమి నేతలు డిమాండ్ చేయడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. క్షమాపణ అంటూ చెప్పాల్సి వస్తే ఆడబిడ్డ పుట్టుక గురించి తప్పుగా మాట్లాడిన చంద్రబాబు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఆడపిల్ల కనిపిస్తే ముద్దు పెట్టాలి.. లేదంటే కడుపు చేయాలని మాట్లాడిన బాలకృష్ణపై కేసులు పెట్టాలని తెలిపారు. జగన్ లండన్‌కు వెళ్తే తప్పుడు వ్యాఖ్యలు చేసిన నారా లోకేశ్‌పై కేసు పెట్టాలన్నారు. జగన్‌ను రేణుకా చౌదరి దారుణంగా దూషించారని.. వారిపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. తనను బండారు సత్యనారాయణ బూతులు తిట్టారని.. ఆయనపై ఎందుకు కేసులు పెట్టలేదని నిలదీశారు.

## ఐదేళ్లు రాక్షస పాలన చూసాం..!



విజయవాడ:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి మంగళవారం విజయవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు.ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమం ప్రజలందరినీ మొక్కలు నాటేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి వివిధ అంశాలపై మాట్లాడారు.పురంధేశ్వరి మాట్లాడుతూ.. ప్రజలు అభివృద్ధికి ఓటు వేసి మూడోసారి నరేంద్ర మోడీకి భారత ప్రధానిని గెలిపించుకున్నారని.. దేశాభివృద్ధి పథంలో బీజేపీకి తిరుగులేదని అన్నారు. వికసిత్ భారత్ అంటే అందరినీ అభివృద్ధి దిశగా నడిపించినపుడే సాధ్యమవుతుంది అని పురంధేశ్వరి పేర్కొన్నారు.

ధృడమైన నాయకత్వం కావాలని ప్రజలు ఆశించి 2014లో మార్పును తీసుకొచ్చారు. అప్పటినుంచి ప్రధాని మోదీ "సబ్ కే సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్" అనే నినాదంతో దేశాన్ని అవినీతి రహిత పాలనవైపు నడిపించారని ఆమె అన్నారు.ప్రధాని మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం పేదవారికి మేలు చేసే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు. అలాగే ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్లలో ప్రజలు అనుభవించిన రాక్షస పాలనకు ముగింపు పలికే విధంగా 2024లో ఎన్డీయే కూటమికి అధికారం ఇచ్చారన్నారు. గ్రామీణ అభివృద్ధికి ప్రధాని మోదీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, రాష్ట్రాన్ని కూడా ఆ దిశగా మద్దతు ఇస్తున్నారని పురంధేశ్వరి స్పష్టం చేశారు.

## బోనాల ఉత్సవాలు.. రూ. 20 కోట్ల కేటాయింపు..



హైదరాబాద్,నగరంలో ప్రసిద్ధి చెందిన పండుగ బోనాల ఉత్సవాలు అని .. త్వరలో ప్రారంభం కానున్న బోనాల ఉత్సవాలపై మంగళవారం అన్ని విభాగాల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. పండుగ కోసం ప్రభుత్వాన్ని రూ. 30 కోట్లు అడిగామని.. రూ. 20 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా గత ఏడాది బోనాల పండుగ జరుపుకున్నామని, ఒకటి రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తాయని.. ఈ సారి ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీఐపీ మూమెంట్‌లో తొక్కిసలాటలు జరుగుతున్నాయని, అవి జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు..

జోగినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. గతంలో జరిగిన దానికంటే ఇంకా మంచిగా బోనాల ఉత్సవాలు జరపాలని అనుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ చెప్పారు. సరస్వతి పుష్కరాలు కూడా అద్భుతంగా నిర్వహించామని.. పక్క రాష్ట్రాల భక్తులు కూడా ఎంతో అభినందించారని అన్నారు. అధికారులు సమన్వయంతో ఉండి డ్యూటీ చేయాలని.. సంయమనం పాటించాలని కోరుతున్నామన్నారు. భక్తులతో దురుసుగా ప్రవర్తించకుండా మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ దర్శనం చేయించాలన్నారు. గత ఏడాది బోనాల సమయంలో పొన్నం ప్రభాకర్ వీడియో వైరల్ అయిందని.. ఈసారి ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..

2024 యాక్షన్ ప్లాన్‌ను సరిచేసుకుని 2025లో ప్లాన్ రెడీ చేసుకోవాలని అధికారులకు సూచించారు. గత ఏడాది జరిగిన పొరపాట్లు ఈసారి జరగకుండా చూసుకోవాలన్నారు. గోల్కొండ జగదాంభిక అమ్మవారి తొలి బోనంతో బోనాల ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. గోల్కొండ జాతర, బల్కంపేట ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణోత్సవం, లష్కర్, లాల్ దర్వాజ బోనాలు, అమ్మవారి అంబారి ఊరేగింపు, రంగం కార్యక్రమాలు అన్ని సక్రమంగా జరిగేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఈసారి బోనాలకు ప్రభుత్వం రూ. 20 కోట్లు విడుదల చేసిందన్నారు. నూతన దేవాలయాలు యాడ్ అయ్యాయి కాబట్టి ఇంకో 10 శాతం ఫండ్స్ రిలీజ్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండోమ్మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ చెక్కులు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. డ్యూటీ లా కాకుండా ప్రతి ఒక్కరు అమ్మవారి ఆజ్ఞతో సేవ చేస్తున్నామని అనుకోవాలన్నారు. అన్ని డిపార్టుమెంట్‌లు ఎక్కడ ఇష్యూ లేకుండా చూసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం జరగాలని కోరుకుంటున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు.

## కెమెరాకు చిక్కిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల వసూళ్ల దందా..



సూర్యాపేట, ' గత ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచాను.. నేను మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు.. నా డబ్బులు నేను రాబట్టుకోవాల్సిందే.. ఎవ్వరు డబ్బులు ఇవ్వకున్నా వాడిని ఇడిశేదే లేదు' అంటూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తుంది.ఇప్పటికే సొంత పార్టీ నేతలతో పొసగక నెలకు ఒకసారి ఎమ్మెల్యేను సొంత పార్టీ నేతలు తూర్పారబట్టడం.. ఇసుక, కాంట్రాక్టులన్నీ ఎమ్మెల్యే కుటుంబమే చేసుకుంటూ పార్టీ కోసం కష్టపడిన వారిని కనీసం పట్టించుకోవడం లేదంటూ రోడ్డెక్కి మరీ ఆరోపణలు చేస్తుండగా తాజాగా మరో వివాదంలో ఎమ్మెల్యే సామేల్ ఇరుక్కున్నారు. లిక్కర్ సిండికేట్ నిర్వాహకుల నుంచి ఎమ్మెల్యే మామూళ్లు అంటూ ఓ వీడియో వైరల్ అవుతున్నది. వైన్స్ యజమానులతో ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆ వీడియో చూస్తే అర్థం అవుతుంది. ఎమ్మెల్యే సామేల్‌తో బేరసారాలాడుతూ లిక్కర్ మాఫియా స్టింగ్ ఆపరేషన్ చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే మామూళ్ల వ్యవహారం బయటపెట్టాలనే ఉద్దేశంతోనే సీక్రెట్ కెమెరాతో సిండికేట్ మాఫియా ఆపరేషన్ చేసిందని ప్రచారం జరుగుతోంది.ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టా రికవరీ కావాలి. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు. డీజిల్‌కు కూడా డబ్బులు లేవు.. ప్రభుత్వం ఇచ్చే జీతం కొసరు అవుతలేదు మీరిచ్చే మామూలు నాకు టీ ఖర్చులకు కూడా సరిపోవు.. అంటూ తన మాట వినని వాళ్ల సంగతి చూస్తానని వైరల్ అవుతున్న వీడియోలో ఎమ్మెల్యే సామేల్ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## రాహుల్ గాంధీ ఆశయాలను రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారు



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికే పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. పదవులపై కాంగ్రెస్ పార్టీలో హామీలు ఏమీ ఉండవు అని అన్నారు. హిమాయత్ నగర్ లో రూ.60 లక్షల రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గ విస్తరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ మంత్రివర్గ విస్తరణ చేశారని తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, బిసిలకు ప్రాధాన్యత ఇచ్చారని, హైదరాబాద్ లో తనకు మంత్రి పదవి విషయంలో ఇంకా వేచి చూడాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాలను సిఎం రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెళున్నారని పేర్కొన్నారు. 150 మందికి కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు దానం నాగేందర్ పంపిణీ చేశారు.

## హైకోర్టులో హరీష్ రావుకు ఊరట..ఎన్నికల పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు



హైదరాబాద్,జూన్10:తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో హరీశ్‌రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి హరికృష్ణ, బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. తన కుమారుడి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు.. దాన్ని కొట్టివేసింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టిసారించాలని సూచించారు. అక్రమ కేసులకు భయపడేది లేదని.. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నయవంచనను ఎండగట్టి తీరుతామని హెచ్చరించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## జగన్‌ను దేవుడు కూడా క్షమించడు

నెల్లూరు, జగన్ రెడ్డిని దేవుడు కూడా క్షమించడు అంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విరుచుకుపడ్డారు .. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును జగన్ రెడ్డి ఖండించడంతో ఆడపడుచుల పట్ల ఆయనకున్న ఆలోచనలు బయటపడ్డాయన్నారు. విశ్లేషకుడిగా కృష్ణంరాజు తెలుగు ఆడపడుచుల గురించి నీచాతినీచంగా, క్రూరంగా మాట్లాడుతుంటే ఆ క్షణమే ఖండించి, క్షమాపణ చెప్పించి, డిబేట్ నుంచి బహిష్కరించాల్సిన బాధ్యత కొమ్మినేనితో పాటు యాజమాన్యానికి లేదా..? అని ప్రశ్నించారు.. ఆ పని అప్పుడు చేసివుంటే ప్రజలు హర్షించేవారు. అది చేయకపోగా వ్యంగ్యంగా నవ్వుతూ ఆ విశ్లేషకుడిని సమర్థించడం అందరూ చూశారని గుర్తుచేశారు.. అప్పట్లో వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వారిపై జగన్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇప్పుడు 11 సీట్లకు పరిమితమయ్యారని మండిపడ్డారు.. ఈ రోజు ఆడపడుచుల పట్ల తన మనసులోని వైఖరిని బయటపెట్టారు. ఇక జగన్ రెడ్డిని దేవుడు కూడా క్షమించరు అంటూ ఫైర్ అయ్యారు.

## బెట్టింగ్ యాప్‌కు మరొకరు బలి

రాజన్న సిరిసిల్ల, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల మరణాలు ఆగడం లేదు. బెట్టింగ్ యాప్‌లపై నిషేధమున్నా ఫోన్‌లో రోజుకో 4 కొత్త బెట్టింగ్ యాప్స్ పుట్టుకురావడంతో.. యువకులతో పాటు ఉద్యోగులు వాటి బారినపడుతున్నారు. అదేవిధంగా బెట్టింగ్ పెడుతూ.. ఉన్నదంతా పోగొట్టుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆస్తులు తాకట్టుపెట్టి, లోన్ యాప్‌లలో అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. అప్పులు, లోన్లు ఇచ్చినోళ్ల వేధింపులు భరించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. తాజాగా మరో యువకుడు బెట్టింగ్ యాప్ భూతానికి బలయ్యాడు. అత్యాశకు బెట్టింగ్ యాప్‌ల్లో పందెలు పెట్టి.. నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లె గ్రామానికి చెందిన తుమ్మల వంశీ (25) కరీంనగర్‌లో వీల్ అలైన్‌మెంట్ మెకానిక్ వర్క్ చేస్తుంటాడు. ఈ క్రమంలో బెట్టింగ్ మోజులో పడిన వంశీ.. రూ.10 లక్షల వరకు అప్పులు చేసి బెట్టింగ్ పెట్టాడు. బెట్టింగ్‌లో లాస్ రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యాడు. ఇక చేసేదేమి లేకపోవడంతో సోమవారం పొలం దగ్గర చెట్టుకు ఉరివేసుకొని వంశీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చేతికి అందొచ్చిన కొడుకు బెట్టింగ్ భూతానికి బలికావడంతో మృతుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## చర్చనీయాంశంగా లేఖ...

నల్లగొండ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో జిల్లాకు నిరాశే మిగిలింది. మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని అందులో జిల్లా నేతలు ఇద్దరికి చోటు దక్కుతుందని కొంతకాలంగా పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అధిష్ఠానం కూడా ఆ దిశగా ఆలోచన చేయడంతో జిల్లాకు పక్కా మంత్రి పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ ఆదివారం ప్రకటించిన మంత్రివర్గంలో జిల్లా నేతలకు చోటు దక్కకపోవడంతో ఆశ నిరాశగానే మిగిలిపోయింది. అయితే మంత్రివర్గంలో మరో మూడు స్థానాలు ఖాళీగా ఉన్న నేపథ్యంలో మరోసారి జరిగే మంత్రివర్గ విస్తరణలోనైనా? అవకాశం దక్కుతుందా? ముఖ్యంగా ఎప్పటినుంచో మంత్రి పదవి ఆశిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇస్తారా? అన్న దానిపై జిల్లాలో జోరుగా చర్చసాగుతోంది.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి వర్గంలో దక్కని చోటు

ఈసారి మంత్రి వర్గ విస్తరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కలేదు. ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినందునే ఆయన బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారన్న చర్చ జరిగింది. అయితే మొదటి మంత్రివర్గంలో రాజగోపాల్‌రెడ్డి సోదరుడైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చోటు దక్కడంతో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి మంత్రి పదవి ఇచ్చేందుకు అధిష్టానం మొగ్గు చూపకపోవడంతో రాజగోపాల్‌రెడ్డికి అప్పట్లో చోటు దక్కలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికల సమయంలో అధిష్టానం రాజగోపాల్‌రెడ్డితో మాట్లాడి భువనగిరి ఎంపీ గెలుపు బాధ్యతను ఆయనకు అప్పగించింది. ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన అన్నీ తానై ఆ బాధ్యతను భుజాన వేసుకుని భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించారు. దీంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని కాంగ్రెస్ వర్గాలతో పాటు జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది.

వాయిదా పడుతూ విస్తరణ..

పార్లమెంట్ ఎన్నికల నాటినుంచి మంత్రివర్గ విస్తరణ రేపు మాపు అంటూ వాయిదా పడుతూ వచ్చింది. ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ వార్తలు వెలువడినా.. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఖాయమని ఆయన అనుచరులు నమ్మకంతో ఉన్నారు. ఆదివారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. దీంతో ఆయన అలకవహించినట్లు చర్చ జరగడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆయనను బుజ్జగించేందుకు ప్రయత్నించినా ఆదివారం రాత్రి వరకు వారికి అందుబాటులోకి రాలేదు.

బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్

ఇస్తారని మొన్నటి వరకు చర్చ మరోవైపు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ లంబాడా కోటాలో మంత్రి పదవిని ఇవ్వాలని గతంలోనే అధిష్టానాన్ని అడిగారు. ఆ దిశగా అధిష్టానం కూడా మొగ్గు చూపినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. జిల్లాకు ఇప్పటికే ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నందున, మరో రెండు మంత్రి పదవులు ఇస్తే ఇతర సమస్యలు వస్తాయన్న ఆలోచనతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి, బాలునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ ఇస్తారని అసెంబ్లీ సమావేశాల సమయంలో జోరుగా చర్చ సాగిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఇద్దరిలో ఏ ఒక్కరికి కూడా బెర్తు దక్కలేదు.

చర్చనీయాంశంగా మారిన జానా లేఖ

రెండు నెలల కిందట మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని విస్తృత ప్రచారం జరిగింది. అదే సమయంలో రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి అధిష్టానానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దాంతో రాజగోపాల్‌రెడ్డి ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. కొన్నాళ్ల తరువాత ఆ చర్చ సద్దుమణిగినా ప్రస్తుతం విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి, బాలునాయక్‌కు పదవులు దక్కలేదు.

## మహిళలను కించపరిచిన వారికి శిక్ష పడాల్సిందే

అమరావతి, అమరావతి మహిళలను కించపరిచిన వారికి శిక్ష పడాల్సిందే అని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. సాక్షి మీడియాలో రాజధాని మహిళలపై చేసిన వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరని పేర్కొన్నారు. అమరావతికి కులం, మతం ఆపాదించడం సరికాదన్నారు. ఇక్కడి ఆడవాళ్లు ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. రాజధాని కోసం భూములు ఇవ్వడమే వాళ్లు చేసిన తప్పా?అని నిలదీశారు. వాక్ స్వాతంత్య్రం పేరుతో మహిళలను నోటికొచ్చినట్లు- మాట్లాడితే ఊరుకునేది లేదు. అమరావతి రైతులు సాక్షి మీడియాను ఏమైనా అన్నారా? వాళ్లు మళ్లీ రోడ్డెక్కే పరిస్థితిని సాక్షి మీడియా

# రాజగోపాల్ రెడ్డికి హ్యాండ్..!! అందుకేనా?



హైదరాబాద్, సామాజిక న్యాయం అనుసరించి మంత్రివర్గ విస్తరణ సజావుగా అమలైనట్టేనా? ఈ విస్తరణ ద్వారా తెలంగాణ సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నట్టు? కులాల వారీగా, ప్రాంతాల వారీగా భర్తీ జరిగినట్టే భావించాలా? అసంతృప్తుల మాటేమిటి? మిగిలిన జిల్లాల పరిస్థితి ఏమిటి? మొత్తం మంత్రి వర్గంలో కవరైన కులాలేంటి? ప్రాతినిధ్యం లభించని కులాల మాటేమిటి?

కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం

తెలంగాణ కేబినెట్ విస్తరణలో కొత్తగా ముగ్గురికి అవకాశం దక్కింది. వీరిలో గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు రేవంత్ ప్రభుత్వం ఛాన్స్ కల్పించింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నూతన మంత్రులతో ఆదివారం- రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్త మంత్రులకు త్వరలో శాఖల కేటాయింపు చేసే అవకాశాలు ఉన్నాయి.

కొత్త మంత్రులకు సీఎం రేవంత్ అభినందనలు

ప్రమాణ స్వీకారం చేసిన నూతన మంత్రులు.. వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకి అభినందనలు చెప్పారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న రామచంద్రనాయక్‌కు కూడా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రనాయక్

తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రనాయక్‌ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండు రోజుల్లో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ సందర్భంగా డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం గిరిజన జాతికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని రామచంద్రనాయక్ తెలిపారు. డోర్నకల్ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పారు. తనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సహచర ఎమ్మెల్యేలకు రామచంద్రనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని రామచంద్రనాయక్ పేర్కొన్నారు.

సీఎం హామీ మేరకు మహబూబ్ నగర్ నుంచి శ్రీహరి

మహబూబ్ నగర్ నుంచి వాకిటి శ్రీహరి ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా.. సిఎం రేవంత్ హామీ .. ప్రకారం ఈ కేబినేట్ బెర్త్ దక్కినట్టు తెలుస్తోంది. ఇక వివేక్ వెంకట స్వామి, మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాద్ బాబు ఎస్సీ- మాల సామాజిక వర్గానికి చెందిన వారు. అడ్లూరి లక్ష్మణ్ మాదిగ సామాజిక వర్గం .. కాంగ్రెస్ పార్టీకి ఎప్పటి నుంచో లాయల్ గా ఉన్నారు. ఇప్పటికే మాదిగ ఉపకులానికి చెందిన దామోదరరాజనర్సింహ మంత్రి వర్గంలో ఉన్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు.. నాలుగు సార్లు గెలిచిన తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడం పై ఆయన అలకబూనారు.. రాజీనామా చేస్తానని కూడా అన్నారు సుదర్శన్ రెడ్డి. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్- మినాక్షి నటరాజన్ పీసీసీ చీఫ్- మహేష్ గౌడ్ , సింఎం సలహాదారు- వేం నరేందర్ రెడ్డి.. కలసి సుదర్శన్ రెడ్డిని బుజ్జగించారు. ప్రేమ్ సాగర్ రావు ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి ఆశించారు. ఈయన్ని కూడా రాష్ట్ర పార్టీ నాయకత్వం బుజ్జగించింది.

ఎప్పటి నుంచో పదవినాశించిన రాజగోపాల్ రెడ్డి

మంత్రి పదవి ఎప్పటి నుంచో ఆశిస్తూ వచ్చిన.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందుబాటులోకి రాలేదు.. చిలుకూరు ఫార్మ్ హౌస్ లో ఉన్నట్టు తెలుస్తోంది. మంత్రి పదవి దక్కక పోవడం పై ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. అధిష్టానం హామీ ఇచ్చినా పదవి ఎందుకు దక్కలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సైతం సేమ్ సీన్.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం దక్కకపోవడం పై తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రాహుల్ గాంధీకి , ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే కు లేఖ రాశారు.

మొత్తం మంత్రి వర్గంలో

మొత్తం మంత్రి వర్గంలో.. ఓసి- రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి.. రేవంత్ రెడ్డి, పొంగులేటి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన శ్రీధర్ బాబు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన తుమ్మల, వెలమ సామాజిక వర్గానికి చెందిన జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి, స్పీకర్ ప్రసాద్ కుమార్, వివేక్ వెంకట స్వామీ ఉన్నారు. ఇక ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర్ రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ మంత్రివర్గంలో ఉన్నారు. ఇక ఎస్టీ కోయ- సామాజిక వర్గం నుంచి సీతక్క, ఎస్టీ లంబాడ వర్గం నుంచి డిప్యూటి స్పీకర్ రామచంద్రు నాయక్ ప్రాతినిత్యం వహిస్తున్నారు. బీసీల నుంచి పొన్నం , కొండా సురేఖ, వాకిటి శ్రీహరి మంత్రి వర్గంలో ఉన్నారు.

పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

ఈసారి తెలంగాణ కేబినెట్ విస్తరణలో కాంగ్రెస్‌లో మంత్రి పదవులు ఆశించి పలువురు నేతలు భంగపడ్డారు. వారిని అగ్రనేతలు బుజ్జగిస్తున్నారు. పదవులు రాలేదని నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న నేతలకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సర్దిచెబుతున్నారు.

సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు

కాంగ్రెస్‌లో మంత్రి పదవులు దక్కని వారు తీవ్ర అసంతృప్త జ్వాలల పరిణామం ఎలా ఉండనుంది? అన్న చర్చ జోరుగా సాగుతోంది. మరీ ముఖ్యంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావులు తమకు కేబినెట్‌లో స్థానం తప్పక ఉంటుందని ఆశించారు. ఇదే విషయాన్ని తరచూ అనుచరులు, కార్యకర్తలతో చెప్పుకుంటూ వచ్చారు. చివరకు అనూహ్యంగా వారికి అధిష్టానం మొండిచేయి చూపడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ క్రమంలో వీరిని బుజ్జగించేందుకు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు.

వీరెలాంటి నిర్ణయం తీస్కుంటారో అన్న సస్పెన్స్

తాజాగా సుదర్శన్ రెడ్డి ఇంటికి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెళ్లి బుజ్జగించారు. కానీ ఆ అసంతృప్తి జ్వాల అంత తేలిగ్గా చల్లారేది కాదు. ప్రేమ్‌సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే చర్చ నడుస్తోంది.

మల్ రెడ్డితో పాటు బీర్ల ఐలయ్య సైతం గుర్రుగానే

ఇక, మరో కాంగ్రెస్ సీనియర్ నేత మల్‌రెడ్డి రంగారెడ్డి సైతం మంత్రి పదవి ఆశించి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాస్తానని చెప్పుకొచ్చారు. ఇంకో నేత బీర్ల ఐలయ్య సైతం.. అధిష్టానంపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం శనివారం రోజంతా చర్చనీయాంశమైంది.

కవ్వంపల్లా, అడ్లూరా? అన్న ఉత్కంఠకు తెర

మాదిగ సామాజికవర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లేదా కవ్వంపల్లి సత్యనారాయణకు అవకాశం లభించవచ్చని చర్చల మధ్య అడ్లూరికి స్థానం దక్కింది. ఇక, రెడ్డి సామాజికవర్గానికి ఈసారి విస్తరణలో అవకాశం లేదనే చర్చ మొదటి నుంచీ జరిగింది. ఒకవేళ చోటు లభిస్తే మాత్రం నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత సుదర్శన్ రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయనే వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంగతి సరే సరి.

ఆరింట మూడు ఖాళీలు మాత్రమే భర్తీ

నెలల తరబడి వాయిదాలు పడుతూ వస్తున్న తెలంగాణ కేబినెట్? విస్తరణ సగం మాత్రమే పూర్తయింది. ఆరు పదవులు భర్తీ చేయాల్సి ఉండగా తర్జనభర్జనలు పడి చివరకు మూడు పదవులు భర్తీ చేశారు. వీరిలో గడ్డం వివేక్? పట్ల గతంలో వ్యతిరేకత వచ్చినా కూడా కులాల లెక్కల ప్రకారం ఆయనకు మంత్రి పదవి లభించింది. ఆర్థికంగా ఆయన బలమైన నాయకుడు కావడం, చేతిలో మీడియా ఉండటం కూడా ఒక కారణం కావొచ్చంటున్నారు. ఆయన బీజేపీ నుంచి కాంగ్రెసులోకి వచ్చారు. అయినప్పటికీ కరుణించారు. మిగతా ఇద్దరూ తొలిసారి ఎమ్మెల్యేలు.

మూడింటికి 18 నెలలు, మిగిలిన మూడెప్పుడు?

ఇదిలా ఉంటే ఇప్పుడు చర్చంతా మిగిలిన మూడు పదవుల గురించే. ఆరింట మూడు పదవులు భర్తీ చేయడానికే పద్దెనిమిది నెలలు పట్టింది. మిగిలిన మూడు పదవులు భర్తీ ఎప్పుడు చేసినా.. పోటీ మాత్రం తీవ్రంగానే ఉండేలా తెలుస్తోంది. ఇందులో మరో స్ట్రాటజీ కూడా కనిపిస్తోంది. మూడు పదవులు మాత్రమే భర్తీ చేయడంతో ఒక సామాజిక సందేశం ఇవ్వడంతో పాటు.. కొందరి ఆశలు ఇంకా సజీవంగానే ఉండొచ్చని అంచనా. ఇది ఆశావహులను ఊరటనిచ్చే అంశంగానూ తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి మంత్రి పదవిని ఆశించిన వారిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలున్నారు. వీరి కలలింకా నెరవేరలేదు.

రాజగోపాల్ కి చామలను గెలిపిస్తే మంత్రి పదవన్న హామీ?

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఆయనకు మంత్రి పదవి హామీ ఇచ్చినట్టు చెబుతారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్?కుమార్? రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి గ్యారంటీగా రేవంత్? రెడ్డి ఆశ పెట్టారని అంటారు. దీంతో ఆయన ఎప్పటి నుంచో ఈ పదవి కోసం వెయిట్? చేస్తున్నారు. గతంలో కొన్నిసార్లు కేబినెట్? విస్తరణ అనుకున్నప్పుడు రాజగోపాల్? రెడ్డి పేరు తెర మీదికి వచ్చింది కూడా. తనకు ఎప్పటి నుంచో హెూం మంత్రిగా చేయాలని ఉందని బాహటంగానే చెప్పారాయన. కాబోయే హెూం మంత్రి ఆయనేనంటూ అందరూ అనుకున్నారు కూడా. కానీ ఆ కల ఇప్పటి వరకూ నెరవేరనేలేదు.

మిగిలిన మూడు పదవు భర్తీలో సామాజిక సందేశమేంటి?

ఇక ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, విజయశాంతి సైతం మంత్రిపదవులను ఆశించిన వారిలో ఉన్నారు. వీరికి కూడా చివరికి చోటు దక్కలేదు. మొత్తానికైతే.. ముగ్గిరికి మాత్రమే పదవులిచ్చి.. మిగిలిన మూడు పదవులను అలాగే ఉంచారు. ఈ తర్వాతి భర్తీలో ఎలాంటి ప్రాంతీయ సమతుల్యత పాటిస్తారు? సామాజిక సమీకరణాలను లెకిస్తారు? తేలాల్సి ఉంది. అయితే ఈ హాఫ్ భర్తీ ఫార్ములా ఎవరిదన్న చర్చ కూడా నడుస్తోంది పార్టీలో.

# మణిపూర్‌లో ఎంతకాలం ఈ మంటలు?

మణిపూర్ :ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మళ్లీ మండుతోంది. మెయితీ తెగకు చెందిన అరంబాయ్ తెంగోల్ వర్గం కీలక నేత కానన్ సింగ్‌తో పాటుగా మరి కొందరిని శనివారంనాడు అరెస్టు చేయడంతో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. కానన్ సింగ్‌కు మెయితీలలో గట్టి పట్టు ఉంది. అయితే మణిపూర్ హింసాకాండలో పాత్ర ఉందన్న ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారు. కానన్ సింగ్‌ను అరెస్టు చేసినందుకు నిరసనగా ఆందోళనకారులు ఆదివారం రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. నిషేధాజ్ఞలను సైతం లెక్కచేయకుండా ఆందోళనలు చేశారు. తమ నాయకుడిని విడుదల చేయాలంటూ కొందరు వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటామని బెదిరించారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను రద్దు చేశారు. కొన్ని చోట్ల కర్ఫ్యూను సైతం విధించారు.మరోవైపు మణిపూర్‌లో తాజా హింసాకాండపై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఢిల్లీలో రెండు రోజులుగా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. కేంద్రం పిలుపు మేరకు మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అమిత్‌షాతో చర్చలు జరపడం కోసం సోమవారం ఢిల్లీకి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అయితే మణిపూర్ అల్లర్లు ఇప్పటికిప్పుడు మొదలైనవి కావు. గత రెండేళ్లుగా అక్కడ కుకీ గిరిజనులు, మైదాన ప్రాంతానికి చెందిన మెజారిటీ మెయితీల మధ్య ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అల్లర్లలో 260 మందికిపైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వీరిలో చాలా మంది ఇప్పటికీ శరణార్థి శిబిరాల్లోనే తలదాచుకుని ఉన్నారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం సొంతపార్టీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినా పరిస్థితులు కొలిక్కి రాలేదు.కేంద్ర హెూం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను గవర్నర్‌గా నియమించడంతో రాష్ట్రంలో శాంతి నెలకొంటుందని అందరూ భావించారు. గత ఫిబ్రవరిలో రాష్ట్రపతిపాలన అమలులోకి వచ్చాక రాష్ట్రం కాస్త శాంతించినట్లు కనిపించినా ఇప్పుడు మళ్లీ హింసాకాండ మొదలైంది. మైదాన ప్రాంతాలకు చెందిన మెజారిటీ మెయితీ తెగ తమకు కూడా గిరిజన హెూదా కల్పించాలని గత కొన్నేళ్లుగా ఆందోళన చేస్తూ వస్తున్నారు. దీన్ని కొండ ప్రాంతాలకు చెందిన కుకీ తెగ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మెయితీలకు గిరిజన హెూదా కల్పించినట్లయితే తమ ప్రాంతాలపై వారి ఆధిపత్యం మొదలవుతుందని, తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనేది వారి భయం. అయితే మెయితీలకు గిరిజన హెూదా కల్పించాలని రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ 2023 మేలో మణిపూర్ హైకోర్టు తీర్పునివ్వడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.దీంతో ఒక్కసారిగా రాష్ట్రం అగ్నిగుండంగా మారింది. మెయితీ తెగకు చెందిన గ్రామాలపై కుకీలు దాడి చేయడం, కుకీలకు చెందిన మహిళలను మెయితీ వర్గం ప్రజలు చెరబట్టడం, పలువురు హత్యకు గురికావడంతో మణిపూర్ అంతటా ఉద్రిక్తత నెలకొంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తమ పార్టీకే చెందిన బీరెన్ సింగ్ ప్రభుత్వంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా పరోక్షంగా ఆయనకు



మద్దతుగా నిలిచింది. విపక్షాలన్నీ బీరెన్ సర్కార్‌ను తప్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కసారి కూడా మణిపూర్‌లో పర్యటించి అక్కడి ప్రజలకు భరోసా కల్పించలేదు. పైగా ప్రతిపక్షాలకు చెందిన నేతలు మణిపూర్‌లో పర్యటించడానికి యత్నిస్తే అడ్డుకోవడానికి అన్ని రకాల ప్రయత్నించారు. అయితే రానురాను పరిస్థితి చేయిదాటి పోతోందని భావించిన కేంద్రం చివరికి బీరెన్ సింగ్‌ను పదవినుంచి తప్పించినప్పటికీ రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేయకుండా సుప్త చేతనావస్థలోనే ఉంచింది.అంటే రాష్ట్రంలో మామూలు పరిస్థితులు ఏర్పడితే మళ్లీ బిజెపి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించాలన్నది కేంద్రం ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇటీవల మణిపూర్‌కు చెందిన పలువురు బిజెపి ఎంఎల్‌ఎలు ఢిల్లీలో అమిత్ షాను కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడమే దీనికి నిదర్శనం. మణిపూర్ ఉద్రిక్తతలను కేంద్రం ఇప్పటికీ శాంతిభద్రతల సమస్యగానే చూస్తుండడం విచారకరం. రాష్ట్రంలో రెండు బలమైన తెగల మధ్య కొనసాగుతున్న హింసాకాండకు శాశ్వతంగా ముగింపు పలికే దిశగా చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కేంద్ర హెూంశాఖ కార్యదర్శిగా పని చేసిన భల్లాకు రాష్ట్రంలోని పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఉంది.కేంద్రం కూడా రాష్ట్రంలో శాంతిని నెలకొల్పే బాధ్యతను పూర్తిగా ఆయనకు అప్పజెప్పింది. అయితే గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు గడిచినప్పటికీ భల్లా ఇరువర్గాలతో శాంతి చర్చలకు ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరం.మరోవైపు గత రెండేళ్ల కాలంలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన ప్రధాని మణిపూర్‌లో ఒక్కసారి కూడా పర్యటించకపోవడంపై రాజకీయ పార్టీలేకాక మేధా వివర్గాలు కూడా విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశానికి ప్రధానిగా అన్ని రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడాల్సిన మోడీ సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌ను మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనేది ఎవరికీ అంతుబట్టని విషయంగా మారింది. చిన్న రాష్ట్రమైనా సరిహద్దు రాష్ట్రంగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉంది.పైగా సుదీర్ఘ కాలం శాంతిభద్రతల సమస్య కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ప్రజలు సైతం అభద్రతా భావంతోనే రోజులు వెళ్లదీస్తున్నారు.

## జర్నలిస్టు కృష్ణంరాజుపై చర్యలు తీసుకోండి

విజయవాడ,విజయవాడ పోలీసు కమిషనర్‌ని ఎన్డీఏ కూటమి మహిళా నేతలు సోమవారం కలిశారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజుపై సీపీకి ఫిర్యాదు చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని మహిళలను అభ్యతరకరంగా ధూషించిన కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ సీపీకి వినతి పత్రం ఇచ్చారు. సీపీని కలిసిన వారిలో టీడీపీ ఏపీ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ఆషా, బీజేపీ మహిళా నాయకురాలు బొడ్డు నాగలక్ష్మి, జనసేన నుంచి రవి సౌజన్య, కూటమి మహిళా నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా కూటమి మహిళా నేతలు మీడియాతో మాట్లాడారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. రైతులు చేసిన త్యాగానికి ఈ రోజు కృష్ణంరాజు, కొమ్మినేని మాటలు చాలా దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాక్షి డిబేట్‌లో రాజధాని అమరావతి మహిళల గురించి అభ్యతరకరంగా మాట్లాడారని వాపోయారు. కృష్ణంరాజు, కొమ్మినేని అలా మాట్లాడటం సరికాదని చెప్పారు. సాక్షి మీడియాకి మొదటి నుంచి రాజధాని అమరావతిపై ఒక చిన్న చూపు ఉందని మండిపడ్డారు. రైతులు చేసిన త్యాగం మరువకూడదని చెప్పుకొచ్చారు కూటమి మహిళా నేతలు. ఆ రాజధాని ప్రాంతంలోనే వైఎస్ భారతిరెడ్డి కూడా ఉన్నారని.. ఇప్పటి వరకు సాక్షి మీడియా ఎందుకు ఖండించలేదని కూటమి మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలోని మహిళల గురించి ఈ విధంగా మాట్లాడటం దారుణమని అన్నారు. ఇప్పటికే కొమ్మినేనిని అరెస్టు చేశారని..కృష్ణంరాజుని కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణంరాజుని వెంటనే అరెస్ట్ చేస్తామని విజయవాడ పోలీసు కమిషనర్ అన్నారని తెలిపారు. జగన్ తమ రాజధానిలో మీ భార్య, పిల్లలు కూడా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోని మాట్లాడాలని అన్నారు. జగన్ ఎలా మాట్లాడాలో మంత్రి లోకేష్‌ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. సాక్షి మీడియా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న భారతిరెడ్డి ఇప్పటివరకు ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదని కూటమి మహిళా నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

తిరుమల, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు కదగ్గర పడడంతో భక్తులు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో వస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్స్ పూర్తిగా నిండిపోయి.. వెలుపల క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. సోమవరం కూడా రద్దీ కొనసగింది. 88,257 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా.. 45,068 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.68 కోట్లు- అని టీటీడీ అధికారులు వెల్లడించారు. ఓవైపు వేసవి సెలవులు ముగింపుకు రావడం, మరోవైపు వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రతి రోజు వేలాది మంది భక్తులు తిరుమలకు వస్తున్నారు. మరో వారం రోజుల పాటు- భక్తుల రద్దీ కొనసాగే అవకాశం ఉందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.

# సుగవాసి టీడీపీ రాజీనామా వెనుక అసలు కారణాలు ఇవే?



కడప : కడప జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న చరిత్ర సుగవాసి కుటుంబానిది.. సుగవాసి బాలసుబ్రమణ్యం తండ్రి తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్యే, ఎంపీగా సేవలందించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి సుబ్రమణ్యం ఓటమి పాలయ్యారు. అలాంటి కుంటుంబం నేడు పార్టీలో ఎదరవుతున్న అవమానాలు, వర్గపోరు భరించలేక రాజీనామా చేస్తున్నట్లు అధినేతకు లేఖ రాయడం జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. సుదీర్ఘ రాజకీయం అనుభవం కలిగిన ఆ కుటుంబం అసలు టీడీపీకి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది? వారి భవిష్యత్తు ప్రణాళిక ఏంటి?ఉమ్మడి కడప జిల్లాలో సుగవాసి పాలకొండ్రాయుడు అంటే తెలియని వారుండరు.. అన్న ఎన్టీఆర్ కంటే ముందే రాజకీయ ఆరంగ్రేట్రం చేసి 1978లోనే తొలి సారి రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ పిలుపుతో తెలుగు దేశం పార్టీలో చేరి జిల్లా రాజకీయాల్లో తనదైన మార్క్ చూపించారు. పాలకొండ్రాయుడు నాలుగు సార్లు రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా, ఒకసారి రాజంపేట ఎంపీగా గెలిచారు . తండ్రి వారసత్వం అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన సుగవాసి బాలసుబ్రమణ్యం రాజంపేట నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు.సుగవాసి బాలసుబ్రమణ్యం ఒకసారి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. అలాంటి సుగవాసి కుటుంబం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజల అభిప్రాయాలు, సూచనలు, మనోభావాల మేరకు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సుగవాసి బాలసుబ్రమణ్యం టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాశారు . రెండు రోజుల క్రితం తండ్రి సంస్మరణ సభలో కూడా ఆయన తమ్ముడు సుగవాసి ప్రసాద్ బాబు టీడీపీలో విభేదాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు.సుగవాసి కుటుంబం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయడం వెనుక పార్టీలో అంతర్గత విభేదాలే కారణం అంటున్నారు వారి అనుచరులు. గత ఎన్నికల్లో రాజంపేట నుంచి పోటీ చేసిన బాలసుబ్రమణ్యం ఓటమికి పార్టీలో ఓ సామాజిక వర్గం నేతలు వెన్నుపోటే కారణమని ఆరోపిస్తున్నారు. రాజంపేట టీడీపీలో ఆ సామాజికవర్గం నేతలు వైసీపీ అభ్యర్థితో కుమ్మక్కు అయ్యారని రాజంపేటలో జోరుగా ప్రచారం సాగింది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా నియోజకవర్గం ఇన్చార్జ్ విషయంలో విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయట.నియోజకవర్గ లో జరుగుతున్న పరిణామాలపై అధినేతకు విన్నవించినా లైట్ తీసుకున్నారని సుగవాసి తీవ్ర అసంతృప్తి కి లోనయ్యారట. గత కొంత కాలంగా తమ భవిష్యత్తు పై అంతర్మధనం చెందుతూ చివరికి రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల తండ్రి సంస్మరణ సభలో సుబ్రమణ్యం తమ్ముడు ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. పార్టీ ఏదైనా వచ్చే ఎన్నికల్లో సుగవాసి కుటుంబం రాయచోటి నుంచి పోటీలో ఉంటుందని ఆయన ప్రకటించారు. దాంతో సుగవాసి కుటుంబం తెలుగుదేశంపై పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. మరి సుగవాసి ఏ పార్టీ బాట పడతారనేది చూడాలి.ఏదేమైనా సుగవాసి రాజీనామా తెలుగుదేశం పార్టీకి పెద్ద షాకే అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీకి చెందిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీ, జనసేన, బీజేపీలో చేరుతున్నారు. అయితే ఇప్పుడు టీడీపీకే ఓ సీనియర్ నేత రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఇటీవల కడపలో మహానాడు ముగిసిన కొద్దికాలానికే ఆ జిల్లాకి చెందిన ఓ కీలక నేత టీడీపీకి రాజీనామా చేయడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.

# రాజీలే.. నామాలు లేవు!



హైదరాబాద్,ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ, చివరాఖరుకు జరగనే జరిగింది. ముగ్గురికి మంత్రి పదవులు దక్కాయి. మారో మూడు ఖాళీలు ఆశావహుల కోసం రిజర్వులో ఉంచారు. అయినా.. మంత్రి పదవులు ఆశించి భంగపడిన వారు సహజంగానే భగ్గుమన్నారు. రాజీనామా చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. అయితే.. ప్రస్తుత్తానికి అలాంటి ముప్పేమీ లేదని బుజ్జగింపులతో అంతా సర్దుకుందని పార్టీ వర్గాల సమాచారం. అలాగే.. ఇంకా చిన్న చిన్న పొరపొచ్చాలు మిగిలి ఉన్నా.. అధిష్టానం జోక్యంతో అన్నీ సర్దుకుంటాయని మంత్రివర్గ విస్త'రణం' సృష్టించిన సంక్షోభం టీ కప్పులో తుపానుల%వ% సమసి పోతుందని కాంగ్రెస్ పెద్దలు విశ్వాసంతో ఉన్నారు. అయితే.. ఇతరుల విషయం ఎలా ఉన్నా, మంత్రి పదవి కోసమే ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటూ కాంగ్రెస్, బీజేపీ గోడలు దూకిన కోమటి రెడ్డి, మంత్రివర్గంలో ప్రాతినిధ్యంలేని, హైదరాబాద్ రంగా రెడ్డి జిల్లాల ప్రాతినిధ్యం కోసం చాలా కాలంగా గొంతు విప్పి మాట్లాడుతున్న మల్ రెడ్డి రంగా రెడ్డి, అలాగే.. నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి కొంచెం గట్టిగానే అసంతృప్తిని వ్యక్త పరిచారు. ముగ్గురికి ముగ్గురూ రాజీనామా అస్త్రాన్ని సందించారు. అయితే.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవ హారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఒకరిద్దరు మంత్రులు రంగంలోకి దిగి, ఎవరికి చెప్పాల్సిన మాట వారికి చెప్పి బుజ్జగించారు. ఆ విధంగా ప్రస్తుతానికి అయితే.. ఆల్ ఈజ్ వెల్ అన్నట్లు అంతా బాగుందనే పిక్చర్ ఇచ్చారు. అయితే నిజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతా బాగుందా.. మంత్రి వర్గ విస్తరణ సృష్టించిన సంక్షోభం నిజంగానే టీ కప్పులో తుపానులా సమసి పోయిందా? పోతుందా? అంటే.. లేదు. నిజానికి, కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి అంత సులభంగా చల్లారదు. నిత్యాగ్ని హొత్రంలా నిత్యం రగులుతూనే ఉంటుందని పార్టీ పుట్టు పూర్వోత్తరాలు అవపోసన పట్టిన సీనియర్ పాత్రికేయులు అంటున్నారు. ముఖ్యంగా.. రాహుల్ గాంధీ కులగణన జెండా ఎత్తిన నేపధ్యంలో పార్టీలో క్యాస్ట్ ఈక్వేషన్స్ ముందు ముందు మరింతగా మారి పోవచ్చని అంటున్నారు. ఇంత వరకు పార్టీలో కొనసాగుతున్న అగ్రకుల ఆధిపత్యానికి గండి పడే సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో.. రెడ్డి, వెలమ ఇతర సామాజిక వర్గాల్లో అసంతృప్తి అంత తేలిగ్గాచల్లారక పోవచ్చని అంటున్నారు. మరోవంక త్వరలో చేపట్టే క్యాబినెట్ విస్తరణలో మరో మూడు మంత్రి పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. అందులో ఒకటి రాష్ట్ర జనభాలోనే 40 శాతం పైగా ఉన్న, రాష్ట్ర ఆదాయంలో ఇంచుమించుగా సగం వాటా ఇస్తున్న హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాకు కన్ఫర్మ్ చేస్తు న్నట్లు చెప్పారు. అయితే.. పీసీసీ చీఫ్ త్వరలోనే మరో మంత్రి వర్గ విస్తరణని హామీ ఇస్తున్నా.. సంవత్సరంన్నరగా సాగుతున్న. విస్తరణ ప్రహసనం, ప్రస్తుత అనుభవాల దృష్ట్యా.. ఇప్పట్లో మరో విస్తరణ ఉండక పోవచ్చని కాంగ్రెస్ వర్గాలే అంటున్నాయి. అదీ గాక.. ఒక వేళ పీసీసీ చీఫ్ చెప్పినట్లుగానే త్వరలో' మంత్రి వర్గ విస్తరణ ఉన్నా.. సీరియస్ గా మంత్రి పదవి ఆశిస్తున్న ముగ్గురూ, సుదర్శన్ రెడ్డి, రాజ గోపాల రెడ్డి, మల్రెడ్డి రంగా రెడ్డి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో.. ముగ్గురిలో ఇద్దరికి మొండి చేయి తప్పదని అంటున్నారు. ఈ నేపథ్యంలో, భంగపాటుకు గురైన వారిలో ఎవరేమి చేస్తారు, ముఖ్యంగా హెూం మంత్రి కావాలని కలలు కన్న రాజగోపాల రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అనేది ఆసక్తికరంగా మారిందని అంటున్నారు. అదలా ఉంటే మంత్రి వర్గ విస్తరణ ఆశావహులనే కాదు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా, కొందరు ముఖ్య నాయకులకు కూడా రుచించలేదని, అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఒక్కొక కులం నుంచి ఒక్కొకరు చొప్పున ప్రతిపాదించిన ఆరేడు పేర్లలో ఒక్కరికీ బెర్త దక్కలేదని అంటున్నారు. ముఖ్యంగా, సుదర్శన్ రెడ్డి ఒక్కరికన్నా అవకాశం ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చివరి క్షణం వరకు గట్టి ప్రయత్నాలు చేశారని, అయినా అధిష్టానం నో చెప్పిందంటున్నారు. అందుకే ప్రస్తుతానికి, ఆశావహులతో పాటుగా, ముఖ్య నేతలు రాజీ పడినా, భవిష్యత్ లో పరిస్థితులు ఎలా మారాతాయో చెప్పలేమని అంటున్నారు.

# చీఫ్ జస్టిస్‌ను సృష్టించి.. 1.34 కోట్లు కొట్టేసి

హైదరాబాద్,:'మీతో సుప్రీం చీఫ్ జస్టిస్ వీడియో కాల్‌లో మాట్లాడతారు.. ఆయన వీడియో కాల్‌లోకి రాగానే లేచి మాట్లాడుతారు. నిల్చొని నమస్కారం చేయాలి.. ఆ తరువాత మీ కేసు విచారణ మొదలవుతుంది'టూ సైబర్‌నేరగాళు ఫేక్ కోర్టును.. నకిలీ జడ్జిని తయారు చేసి.. కోర్టు ఆధ్వర్యంలో మీ ఖాతాలు అసెస్‌మెంట్ చేస్తామంటూ నమ్మి స్తూ వృద్ధుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఓ రిటైర్డు చీఫ్ సైంటిస్ట్‌ను అలాగే బురిడీ కొట్టి.. డిజిటల్ అరెస్ట్ చేసి రూ. 1.34 కోట్లు సైబర్‌నేరగాళ్లు కొట్టేశారు..రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసుల కథనం ప్రకారం..ఉప్పల్‌కు చెందిన రిటైర్డు చీఫ్ సైంటిస్ట్ ఉద్యోగికి గత నెల 31న ఒక గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీపై బెంగళూర్‌లోని అశోకనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యిందంటూ చెబుతూ దానికి సంబంధించిన వివరాలు పోలీస్ అఫీసర్ సందీప్‌రావు వివరిస్తారంటూ ఫోనను మరొకరికి కనెక్ట్ చేశాడు. దీంతో తనకు తానుగా పోలీస్ అఫీసర్‌నంటూ చెప్పుకుంటూ సందీప్‌రావు ఫోన్‌లో మాట్లాడాడు..'మీ ఆధార్ నంబర్‌ను సదాకత్ ఖాన్ అనే వ్యక్తి దుర్వినియోగం చేశాడు, అతనిని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో నవంబర్ 2, 2024న అరెస్ట్ చేశామన్నారు.అతడిని విచారించిన సమయంలోబోడియా, మయన్మార్, పిలిపిన్స్‌కు సైబర్‌నేరాలు అక్రమంగా మనుషులను రవాణా చేసి వెల్లడయ్యింది.' ఈ నేపథ్యంలో మీ ఆధార్ కార్డుకున్న లింక్‌పై సీబీఐ కూడా దర్యాప్తు చేస్తుందని వివరించింది. ఇప్పటి వరకు మీపై అనుమానంతో కేసు దర్యాప్తు జరుపుతోంది, సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణలో ఉందని, రేపు మిమల్ని సీబీఐ ఆ డాక్యుమెంట్లతో విచారిస్తుందంటూ ఫోన్ పెట్టేశాడు. కొద్దిసేపటి తరువాత సీబీఐ అఫీస్ పేరుతో కొన్ని డాక్యుమెంట్లు పంపించారు, సుప్రీంకోర్టు లోగో, ఢిల్లీ, కర్ణాటక పోలీస్, సీబీఐ పోలీసుల విచారణకు సంబంధిత డాక్యుమెంట్లు అన్నీ అంటూ ఫేక్ డాక్యుమెంట్లు వాట్సాప్ చేశారు.అందులో అరెస్ట్ వారెంట్ కూడా జారీ కావడానికి సిద్ధంగా ఉన్న ఒక డాక్యుమెంట్ కూడా ఉంది. దానిని చూపించిన నకిలీ సీబీఐ అఫీసర్.. మీరు అరెస్ట్ నుంచి తప్పించుకోవాలంటే.. మీకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, మనీ లాండరింగ్‌కు పాల్పడలేదని ప్రాంతాల నుంచి డబ్బురాలేదని రుజువు చేసుకోవాల్సి ఉంటుందని, అందుకు సుప్రీంకోర్టు రిజిస్టర్‌కు సంబంధించిన వివరాల మేం ఇస్తాం..అక్కడికి మీ బ్యాంకు వివరాలను పంపించండి , అవసరమైతే ఆర్టీజీఎస్ ద్వారా మీ ఖాతాలో ఉన్న డబ్బు సుప్రీంకోర్టు ఖాతాకు పంపండి, మీకు ఈ కేసుతో సంబంధం లేదని సమాచారం



నిర్ధారణ అయిన తరువాత కోర్టు నుంచి నేరుగా మీ బ్యాంకు ఖాతాలోకి డబ్బు తిరిగి డిపాజిట్ చేయించుకోండి. మీరు రేపు వీడియో కాల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు మాట్లాడాల్సి ఉంటుంది, తెల్ల దుస్తులు వేసుకొని వీడియో కాల్‌లో మాట్లాడేందుకు సిద్ధంగా ఉంది ఉండాలని, ఆయన చీఫ్‌గా ఉన్న వీడియో కాల్ రావడంతోనే మీరు పైకి లేచి నిల్చుని నమస్కారం చేయాలని సూచించారు. అది నిజమని నమ్మిన బాధితుడు అతడి భార్య మరుసటి రోజు వీడియో కాల్ రావడంతోనే అప్రమత్తమయ్యాడు.

మీ ఖాతాలు అసెస్‌మెంట్ చేయాలి..!

సైబర్‌నెరగాళ్లు వీడియో కాల్‌లో జడ్జీలా మాట్లాడారు..'మీపై తీవ్రమైన ఆరోపణలున్నాయి.. మిమ్మల్ని అరెస్ట్ చేయాలంటే'టూ బెదిరించారు. అయితే మీరు అమాయకులు అయ్యేందుకు కూడా అవకాశం ఉందని, పోలీసులు చెప్పేది ఏకపక్షంగా నమ్మి లేమంటూ మాట్లాడారు. ఇందుకు మీ బ్యాంకు ఖాతాలు అసిస్‌మెంట్ చేస్తే సరిపోతుందని, రెండు రోజుల్లో ఈ అసెస్‌మెంట్ పూర్తిచేయాలని, సుప్రీంకోర్టు ఆమోదం ఇది జరుగుతుందంటూ హామీ ఇచ్చాడు.మీరు సుప్రీంకోర్టుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేస్తే మొత్తం తిరిగి రిఫండ్ అవుతుందని భయపడాల్సిన పనిలేదంటూ భరోసా ఇచ్చారు. ఇది నిజమని నమ్మిన బాధితుడు తన మూడు ఖాతాల్లో ఉన్న రూ. 1.34కోట్ల డబ్బును ఈ నెల 2, 3వ తేదీల్లో సైబర్‌నెరగాళ్ల ఖాతాలోకి బదిలీ చేశాడు. ఆ తరువాత ఎలాంటి ఫోన్లు రాకపోవటంతో మోసమని గుర్తించి రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. చేస్తారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ప్రతిదీ వ్యాపారమే



విజయవాడ, ప్రైవేట్ స్కూళ్లతో పాటు కార్పొరేట్ స్కూళ్లలో ప్రతిదీ వ్యాపారంగానే మారింది. ఫీజుల భారమే అనుకుంటే పుస్తకాలు, డ్రెస్సులు, పెన్నులు, పెన్సిళు అన్నీకూడా వ్యాపర వస్తువులుగా మారాయి. భత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు- పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటు-ంది. అయితే పాఠ్య పుస్తకాలు, నోటు- పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు- పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు- పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇక హైదరాబాద్, విజయవాడ, విశ్వాఖ పట్టణాల్లో కేంబ్రిడ్స్ తరహా స్కూళ్లలో పుస్తకాలకే ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి కనీస్ 25 వేలు ఖర్చు పెట్టాల్సిం వస్తోంది. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకే ఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారం, షూ, టీ- షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు-, కార్పొరేట్ విద్యాసంస్థలు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. స్కూళ్లలో మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు- పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై విద్యార్థి సంఘాలు ఏటా ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. అయితే దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు. అధికారుల తీరు కూడా ఇందుకు కారణంగా చూడాలి. కఠిన నిబంధలు ఉంటే తప్ప వీటిని కట్టడి చేయలేమని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి.

# అయోధ్యలో భూముల సర్కిల్ రేట్ 200 శాతం పెంపు!



లక్నో: పుణ్యక్షేత్రాల్లో భూముల ధరలు సాధారణంగానే ఎక్కువ ఉంటాయి. అందులోనూ కొత్తగా అభివృద్ధి చెందిన ప్రాంతాలైతే ఉన్న పళాన పెరిగిపోతాయి. అయోధ్యలో కూడా అదే సీన్ రిపీట్ అయింది. ఏడాది క్రితమే ఇక్కడ రామ మందిరాన్ని ప్రారంభించి, ప్రాణప్రతిష్ఠ చేసిన విషయం తెలిసిందే. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత భూముల సర్కిల్ రేట్లు సవరించారు. అయితే.. తమకు ప్రయోజనం కలిగించేంత స్థాయిలో ఈ పెంపుదల లేదని రైతులు అంటున్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నారు. కొత్త సర్కిల్ రేట్లపై ఉత్తర్వులు శనివారమే జారీ అయినా.. సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. గత ఏడాది ఆగస్ట్‌లో తాము సర్క్యులేట్ చేసిన ప్రతిపాదనలకు వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సర్కిల్ రేట్ పెంపుదల ప్రతిపాదనలను ఆమోదించామని జిల్లా మేజిస్ట్రేట్ (అయోధ్య) నిఖిల్ ఫుండే ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు చెప్పారు. కొన్ని ఏరియాల్లో మేం ప్రతిపాదించిన దానికంటే ఎక్కువ పెంచాలని ప్రజల నుంచి డిమాండ్లు వచ్చాయని తెలిపారు. అయితే.. మార్కెట్ రేట్‌కు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నామని, దీనిపై ముందుగానే తాము సర్వే కూడా చేశామని ఫుండే వివరించారు.సర్కిల్ రేట్ అనేది జిల్లా అధికార యంత్రాంగం తన పరిధిలో ఉండే భూముల విలువపై వేసే అంచనా. దీని ఆధారంగానే భూముల క్రయవిక్రయాలు, రైతులు, ఇతరుల నుంచి సేకరించే భూములకు విలువ కట్టడం వంటివి ఉంటాయి. అయోధ్య పట్టణంలో రామాలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు అనుమతి ఇస్తూ 2019లో తీర్పు చెప్పింది. ఆ తర్వాత నుంచి భూముల మార్కెట్ ధరలు గణనీయంగా పెరిగిపోయాయి. అయినా.. గత ఏడు సంవత్సరాలుగా సర్కిల్ రేట్లను పెంచలేదు. ఈ నేపథ్యంలో సర్కిల్ రేటును ఆయా ప్రాంతాలు, భూమి స్వభావాలను బట్టి 200 శాతం వరకూ పెంచుతూ జిల్లా అధికార యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని 54 జిల్లాల్లో భూముల సర్కిల్ రేట్‌ను చివరిసారిగా 2017లో సవరించారదు. మరో 21 జిల్లాల్లో 2023లో సవరించారు. తాజాగా పెంచిన సర్కిల్ రేట్.. ప్రత్యేకించి రామజన్మభూమి ఏరియాలో భారీగా పెరిగింది. తిహురా మాంఝా వంటి గ్రామాల్లో 200 శాతం వరకూ ఈ పెంపుదల ఉన్నది. ఇక్కడ 2017 ఆగస్ట్ నుంచి హెక్టార్‌కు 11 లక్షల నుంచి 23 లక్షల వరకూ ఉండేది. ఇప్పుడు అది హెక్టార్‌కు 33 లక్షల నుంచి 69 లక్షలకు పెరిగింది. అభినందన్ లోధా హౌస్ ఇక్కడే భారీ స్థాయిలో భూములు కొనుగోలు చేసింది. ఇందులోనే సినీ నటుడు అమితాబ్ బచ్చన్ గతేడాది రెండు ప్లాట్‌లు కొనుగోలు చేశారు. ఎయిర్‌పోర్ట్ ఉన్న గంజా గ్రామం చుట్టుపక్కల పాత ధరలు హెక్టార్‌కు 28 లక్షల నుంచి 64 లక్షలు ఉండగా.. ఇప్పుడు అవి 35 లక్షల నుంచి 80 లక్షల వరకూ పెరిగాయి.అయితే.. ఈ పెంపుదల తాము ఆశించినంత లేదని కొందరు రైతులు చెబుతున్నారు. రామజన్మభూమికి పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోనూ 200 శాతానికి మించి పెంచాల్సిందని అభిప్రాయపడుతున్నారు.

# బీహార్ లో ఫిఫ్టీ ఫిఫ్టీ అంటున్న బీజేపీ



పాట్నా:బీజేపీ రాజకీయ చాతుర్యం ఏమిటి అంటే ఎక్కడా తగ్గాలో తెలుసుకోవడం. తన బలాన్ని పూర్తిగా అంచనా వేసుకోవడం. ఇక బీహార్ సీఎం గా దాదాపుగా రెండున్నర దశాబ్దాల పాటు కొనసాగుతున్న నితీష్ కుమార్ తోనే మళ్ళీ తమకు అధికార పీఠం దక్కుతుందని బీజేపీ కచ్చితంగా అంచనాలు వేసుకుంటోంది. ఇటీవల కాలంలో నితీష్ కుమార్ వింత వింతగా ప్రవర్తిస్తున్నారు అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మోడీ అమిత్ షా సభలలో కూడా వారి పక్కన ఉంటూ నితీష్ కుమార్ తడబాట్లూ పొరపాట్లు చేయడాన్ని కళ్ళారా చూశారు. అయినా కూడా నితీష్ చేయి వదలడానికి బీజేపీ ఇష్టపడడం లేదు.పైగా నితీష్ నాయకత్వంలోని జేడీయూకి సరిసమాన సీట్లను ఇస్తూ ఫిఫ్టీ ఫిఫ్టీ విధానంలో షేర్ చేసుకుంటోంది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అక్కడ ఎన్డీయే కూటమిలో అయిదు పార్టీలు ఉన్నాయి. బీజేపీ జేడీయూ తర్వాత కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ మూడవ పెద్ద పార్టీ. మరో రెండు చిన్న పార్టీలు కూటమిలో ఉన్నాయి.ఇక ఈ ఏడాది అక్టోబర్ లో జరిగే బీహార్ ఎన్నికల్లో మొత్తం 243లో 203 సీట్లను బేజేపీ జేడీయూ పంచుకోనున్నాయి. ఇందులో కూడా జేడీయూకే 103 సీట్లు ఇచ్చి బీజేపీ వంద సీట్లకు పోటీ పడాలని చూస్తోందట. ఇక మిగిలిన నలభై సీట్లలో చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 30 సీట్లు, మరో రెండు చిన్న పార్టీలకు చెరి అయిదు సీట్లు కేటాయిస్తారు అని అంటున్నారు.బీహార్ లో నితీష్ కి మంచి ఇమేజ్ ఉంది. పైగా ఆయన సామాజిక వర్గం అండ ఉంది. దాంతోనే నితీష్ ని ముందు పెట్టి ఈ ఎన్నికలను ఎదుర్కోవాలని బీజేపీ చూస్తోంది అంటున్నారు. ఒకవేళ నితీష్ కుమార్ పార్టీకి తక్కువ సీట్లు ఇస్తే ఆయన ఎక్కడ ఇండియా కూటమిలోకి వెళ్తారో అన్న కలవరం కూడా ఉంది అని అంటున్నారు.అందుకే ఆయనకే సీట్ల ఒప్పందంలో అగ్ర తాంబూలం ఇవ్వాలని కమలనాథుకు వ్యూహ రచన చేశారు అని అంటున్నారు. సరిగ్గా 2020లోనూ ఇదే విధంగా వ్యవహరించారు. అయితే అప్పట్లో మొత్తం సీట్లను బీజేపీ 121, జేడీయూ 122గా తీసుకున్నాయి.ఈసారి బీజేపీ కొత్త వ్యూహం అనుసరిస్తోంది. ఇద్దరి సీట్లు తగ్గించుకుని మిత్రులకు 40 సీట్లు వదిలేసింది. అందులో కూడా చిరాగ్ పాశ్వాన్ కి ఎక్కువ సీట్లు దక్కేలా చూస్తోంది. ఒకవేళ జేడీయూ కనుక రివర్స్ అయితే చిరాగ్ తో మైత్రిని కొనసాగిస్తూ అధికారం దక్కించుకోవాలన్న వ్యూహమేదో ఉందని అంటున్నారు. ఏది ఏమైనా నితీష్ నే సీఎం అభ్యర్థిగా బీజేపీ ప్రచారం చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com